సాయిరామ్ వెంకటేశ్

జేఈఈ మెయిన్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్ పరీక్షల్లో గౌలిదొడ్డి సాంఘిక, సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎర్రంబాటి సాయిరామ్ (99.46) ప్రథమ, ఉటుకూరి వెంకటేశ్ (99.31) ద్వితీయ స్థానంలో నిలిచారు. మొత్తం 100 మంది గురుకుల విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 80 మంది ఐఐటీ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. వీరిలో 22 మంది విద్యార్థులు 90 శాతం, 40 మంది విద్యార్థులు 80 శాతం, 56 మంది విద్యార్థులు 60 శాతంకు పైగా మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వట్టికొండ పాపరావు తెలిపారు.

బీఈడీ పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్ దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 13 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, 26వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 29వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీఏఎస్ఎల్‌పీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్ఎల్‌పీ కోర్సు మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షా ఫీజును ఈ నెల 29వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 6వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలకు వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎంబీఏ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్ – డే), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 26వ తేదీ నుంచి, ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్ – ఈవినింగ్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 1వ తేదీ నుంచి, దూరవిద్య ద్వారా అందించే పీజీడీసీఏ రెండో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షా తేదీలు ఖరారు

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 13 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్ అండ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు జరుగుతాయని అన్నారు. టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను WWW.BSE.TELANGANA. GOV.IN ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

హత్య కేసులో.. పోలీసులెందుకిలా..?

జూబ్లీహిల్స్ పోలీసుల దాగుడుమూతలు

- సీసీ కెమెరాల్లో రౌడీషీటర్ పిక్స్ రికార్డ్
- అయినా కేసులో పేరు లేకపోవడంపై అనుమానాలు
- పోలీసుల అదుపులో ముఠా సభ్యులు
- పుట్టా రాము హత్య కేసు దర్యాప్తులో ఎన్నో సందేహాలు
- గతంలో లాగే జిలానీ పాత్ర లేదని తేలుస్తారా?

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఓ వ్యక్తి మృతికి కారణమయ్యారని కారులోఉన్న వారందరిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.. కానీ అదే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య ఘటనలో పాల్గొన్న రౌడీషీటర్ పేరును మాత్రం బయటకు వెల్లడించకుండా పోలీసులు దాగుడు మూతలాడుతున్నారు. ఇటీవల జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారి పుట్టా రాము హత్య కేసు దర్యాప్తులో పాల్గొన్న రౌడీషీటర్ విషయాన్ని దర్యాప్తు అధికారులు ఎక్కడ కూడా ప్రస్తావించకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తున్నది. గత బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌లోని హిమాంబీ

హత్య జరిగిన రోజు, తన ముఠాతో వ్యభిచార గృహానికి వెళ్తున్న జిలానీ అతడి ముఠా

అలియాస్ హసీనాకు చెందిన భవనంలోని పెంట్ హౌజ్‌కి పుట్టా రామును పిలిపించి, పదకొండు మంది వ్యక్తులు కత్తులతో విచక్షణ రహితంగా పొడిచి చంపారు. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు సీసీ కెమెరాలు, ఫోన్ కాల్స్ ఆధారంగా నిందితులను గుర్తించి అందులో ఎ1 నుంచి ఎ6, ఎ12, ఎ13 వరుసగా అరెస్ట్ చేసినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

రౌడీషీటర్ పేరు ప్రస్తావనేది..?

పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించడంతో అందులో బోరబండకు చెందిన రౌడీషీటర్ జిలానీ ఉన్నాడు. కానీ పోలీసుల ఎదుట లొంగిపోయిన ఆరుగురిలో జిలానీ లేకపోగా.. కేసులో అతడి పేరు ఎక్కడ ప్రస్తావనకు రాలేదు. ముఠాలోని ఆరుగురు పోలీసులకు చెప్పిన విషయం ఏమిటీ, రౌడీషీటర్ పాత్రను వివరించారా? అనేది పోలీసులు విలేకరుల సమావేశంలో వెల్లడించలేదు. రిమాండ్ రిపోర్టులోనూ పేర్కొనలేదు. కేవలం ఎ7 నుంచి ఎ11 వరకు పరారీలో ఉన్నట్లు చెబుతున్నా.. ఇప్పటికే పరారీలో ఉన్న నిందితులెవరనే విషయంపై పోలీసులకు స్పష్టత వచ్చింది. వారి పేర్లను ఎందుకు ప్రస్తావించడం లేదనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

హత్య చేసి లొంగిపోతారు..!

రౌడీషీటర్ జిలానీ తన గ్యాంగ్‌తో ఒక హత్య చేశాడంటే .. పోలీసుల దృష్టి తనవైపు కేంద్రీకృతం కాకుండా 24 గంటల్లోనే తన గ్యాంగ్ సభ్యులను పోలీసుల ఎదుట లొంగిపోయేలా చేస్తాడని గతంలో హత్యకు గురైన బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. మూడు నెలల క్రితం మెదక్ జిల్లా నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బోరబండకు చెందిన సయ్యద్ నుమాన్ హత్యకు గురయ్యాడు. అంతకు ముందు నుమాన్‌కు, జిలానీ కుటుంబ సభ్యులకు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో గాయపడిన నుమాన్ బోరబండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి గాంధీ దవాఖానకు వెళ్తుండగా జిలానీ కిడ్నాప్ చేసి నర్సాపూర్ అడవుల్లోకి తరలించి హత్య చేశాడని అతడి కుటుంబ సభ్యులు గతంలో ఆరోపించారు. అయితే ఈ కేసులో జిలానీ పాత్ర లేదని అక్కడి పోలీసులు తేల్చారు. ఆ కేసులోను హత్య జరిగిన తరువాత నిందితులు లొంగిపోయారు. అలాగే జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో హత్య జరిగిన తరువాత ఆరుగురు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. ఇక్కడ కూడా జిలానీ పాత్ర లేదని తేలుస్తారా? అనే సందేహాలు సర్వత్రా వినవస్తున్నాయి.

సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ కాశం

ఓయూలో సంతకాల సేకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 13 : ఉస్మానియా యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్‌టీఎస్ఏ) ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కాశం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి సరైన నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. మెస్ బకాయిలను రద్దు చేయడంతో పాటు ఉచిత మెస్ సౌకర్యం కల్పించాలన్నారు. హేతుబద్ధత లేకుండా పెంచిన అన్ని కోర్సుల ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి పరిశోధక విద్యార్థికి ఫెలోషిప్ మంజూరు చేయాలని, అన్ని యూనివర్సిటీల విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, గురుకుల విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధక విద్యార్థులు మనోజ్, ప్రసాద్, నవీన్, జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

మాల్స్, పబ్స్ ఎదుట ట్రాఫిక్ రద్దీ ఏర్పడొద్దు

సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ, శ్రీనివాస్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : రోడ్డు సేఫ్టీ నెల సందర్భంగా మంగళవారం సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ డీవీ శ్రీనివాస్‌రావు నేతృత్వంలో మాల్స్, పబ్స్ నిర్వాహకులతో ట్రాఫిక్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. పక్కాగా పార్కింగ్ సౌకర్యం, సెక్యూరిటీ గార్డ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీడీఎఫ్‌డీతో యూపీ ఫోరెన్సిక్ ఒప్పందం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ) : లక్నోలోని యూపీఎస్ఐ ఫోరెన్సిక్ సైన్స్‌కు సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ పరిశోధన కేంద్రం సాంకేతిక సాయం అందించనున్నది. డీఎన్ఏ, ఫింగర్‌ప్రింటింగ్ విశ్లేషణలో లోతైన విశ్లేషణ, పరిశోధన సామర్థ్యాన్ని కలిగిన సీడీఎఫ్‌డీతో ఆ సంస్థ ఒప్పందం చేసుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ పరిశోధనల్లో అవసరమైన సాంకేతికతను అందించడంతోపాటు, నైపుణ్యాలను పెంపొందించడంలో సీడీఎఫ్‌డీ ముఖ్య భూమికను పోషించనున్నది. ఫోరెన్సిక్ సైన్సెస్‌లో విద్యా ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా యూపీఎస్ఐఎఫ్ఎస్ పనిచేస్తుండగా, ఫోరెన్సిక్ సైన్స్‌లో డిగ్రీ, పీజీ, డిప్లోమా కోర్సులను అందిస్తున్నది. తాజా ఒప్పందం ప్రకారం అకాడమిక్, రీసెర్చ్, టెక్నాలజీ వంటి అంశాల్లో ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. కాగా ఉప్పల్‌లోని సీడీఎఫ్‌డీలో జరిగిన కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు.

హరివిల్లు కవితా సంపుటి ఆవిష్కరణ

కవాడిగూడ, ఫిబ్రవరి 13 : ఎన్టీఆర్ స్టేడియంలో హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్‌లో ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఆలూరి విల్సన్ రచించిన 'హరివిల్లు' (ఇంద్ర ధనస్సు) కవితా సంపుటిని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సహృదయం సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వేదుల శ్రీరామశర్మ, సినీ నటుడు మాణిక్ తేజ, చుక్కా రామదాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు హైసియా నేషనల్ సమ్మిట్

హాజరుకానున్న ఐటీ మంత్రి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరంలో ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) రంగం అభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటైన హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) ఆధ్వర్యంలో 31వ నేషనల్ సమ్మిట్, అవార్డుల ప్రదాన కార్యక్రమం నగరంలోని హెచ్ఐసీసీ వేదికగా బుధవారం (ఈ నెల 14న) నిర్వహిస్తున్నామని హైసియా ప్రతినిధి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్, ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అర్విందర్ కుమార్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

గచ్చిబౌలిలోని ఈపీటీఆర్‌ఐలో నిర్వహించిన వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రముఖులు, మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్ తదితరులు

హరిత సంపదను సంరక్షించుకోవాలి

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 13 : తెలంగాణలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు హరిత సంపదను సంరక్షించడానికి అవసరమైన పరిశోధనలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉన్నదని రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రభుత్వ కార్యదర్శి, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణీప్రసాద్, మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ)లో ''బిల్డింగ్ క్లైమేట్ రెసిలెన్స్ ఆన్ ఫారెస్టు సెక్టార్ కార్బన్ క్రెడిట్స్, కార్డన్ ట్రేడింగ్ అండ్ గ్రీన్ క్రెడిట్స్'' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి ప్రభాకర్, ఈపీటీఆర్ఐ సీనియర్ సైంటిస్టు శేష శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. పలువురు ఫారెస్టు విభాగం అధికారులు, ఈపీటీఆర్ఐ ప్రతినిధులు ఈ వర్క్‌షాపులో పాల్గొన్నారు.

గురుకులాల్లో ఆత్మహత్యలెందుకు?

- రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల 65మంది బాలబాలికలు మృతి
- ఫుడ్ పాయిజన్‌తో 83మందికి అస్వస్థత
- పాలన నిర్వీర్యంతోనే విద్యార్థులకు అవస్థలు
- ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలి

సీఎంకు ఎంపీ ఆర్.కృష్ణయ్య లేఖ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ) : ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం తెలంగాణ సీఎంకు లేఖ రాశారు. సూర్యాపేట, భువనగిరితోపాటు ఇటీవల 65 మంది బాల బాలికలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆత్మహత్యలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గురుకులాల్లో పాలన నిర్వీర్యమైందన్నారు. దీని మూలంగా విద్యార్థుల చదువు, ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. పాము కాటుతో చనిపోతున్న వారు ఉన్నారని తెలిపారు. భువనగిరిలో అమ్మాయిని కొందరు చంపి.. దానిని కప్పిపుచ్చడానికి తల్లిదండ్రులపై బీసీ సంఘం నాయకులపై పోలీసులు తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కొందరూ అధికారులు ఏళ్లుగా పాతుకుపోవడంతోనే నిర్లక్ష్యం పేరుకుపోతుందన్నారు. కీసర బీసీ గురుకులంలో విష పురుగుల సంచారం జరుగుతుందన్నారు. కాగజ్ నగర్ గురుకుల బాలికల పాఠశాలలో తలనొప్పితో బాధపడుతున్న విద్యార్థినికి మెరుగైన వైద్యం అందక చనిపోయిందని, కొమురం భీం, ఆసిఫాబాద్ బాలుర గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో 83 మంది అస్వస్థతకు గురయ్యారని లేఖలో పేర్కొన్నారు. బాటసింగారం బీసీ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి మృతి అనుమానాస్పదంగా ఉన్నదని, షాద్‌నగర్ గురుకుల పాఠశాలలో బాలుర వసతి గృహంలో ఎలుక కరవడంతో ఆసుపత్రి పాలయ్యారని, యాదాద్రి భువనగిరి బాలికల పాఠశాలలో ఇద్దరు అమ్మాయిలు ఆత్మహత్యకు పాల్పడినట్లుగా లేఖలో ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు.

జాతీయ విద్యావిధానంతోనే సమగ్ర విద్యాభివృద్ధి

- వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 13 : జాతీయ విద్యావిధానం ద్వారా సమగ్ర విద్యాభివృద్ధి జరుగుతుందని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ అన్నారు. బాలికా సాధికారత ద్వారానే దేశం ముందడుగు వేస్తుందని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల కంటే విద్యార్థినుల సంఖ్య అధికమని అన్నారు. 'ఎంపవరింగ్ స్కూల్ గర్ల్స్ ఆఫ్ తెలంగాణ.. రోల్ ఆఫ్ కేజీబీవీఎస్ ఇన్ ది లైట్ ఆఫ్ ఎన్ఈపీ – 2020'అనే అంశంపై ఓయూ ఎడ్యుకేషన్ కళాశాలలో ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ కోఆర్డినేటర్, ఎన్‌సీటీఈ – ఎస్ఆర్‌సీ సభ్యుడు డాక్టర్ పి.శంకర్ మాట్లాడుతూ ఐసీఎస్ఎస్ఆర్ మంజూరు చేసిన ప్రాజెక్టులో భాగంగా తాము రాష్ట్ర వ్యాప్తంగా 54 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో (కేజీబీవీ) మూడు వేల మంది విద్యార్థులతో అధ్యయనం చేసి ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించే ముందు దానికి సంబంధించిన వారితో ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. బాలికా సాధికారతకు కేజీబీవీలు ఎలా ఉపయోగపడుతున్నాయనే అంశంపై తాము లోతుగా అధ్యయనం చేశామని, పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడం కొంత లోటుగా ఉందని అభిప్రాయపడ్డారు. లైబ్రరీ, ల్యాబ్‌ల ఏర్పాటుతో పాటు శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేయాలని, కాస్మాటిక్ చార్జీలు రెగ్యులర్‌గా అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్క్‌షాప్‌కు కేజీబీవీ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రాజెక్టు ఆఫీసర్లు, డ్వాక్రా సంఘాల మహిళలు, ఆశా వర్కర్లు, వివిధ యూనివర్సిటీ అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో యూజీసీ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మల్లేశం, సమగ్ర శిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేశ్ చంద్ర, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్లు రఫీ మహమ్మద్, డాక్టర్ అనుగంటి సురేశ్, డాక్టర్ వివేక్‌వర్ధన్ పాల్గొన్నారు.

ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌ను సన్మానిస్తున్న వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శంకర్

డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్ జట్టుకు ఎంపికైన యువ క్రికెటర్ త్రిషా పూజితను మంగళవారం మాదాపూర్‌లో అభినందిస్తున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు.

16న నీటి సరఫరాలో అంతరాయం

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న సింగూరు ప్రాజెక్టులో భాగంగా పెద్ద పూర్ పంప్‌హౌజ్ దగ్గరున్న 132కేవీ సబ్‌స్టేషన్‌లో టీఎస్ఎస్పీడీసీఎల్ నిర్వహణ పనులు చేపట్టనున్నది. ఈ నిర్వహణ పనులు 4 గంటల పాటు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. ఈ నెల 16న (శుక్రవారం) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పనులు సాగుతాయని, దీంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. షేక్‌పేట రిజర్వాయర్, భోజగుట్ట (పాక్షిక), బంజారా, ఎర్రగడ్డ రిజర్వాయర్ల ప్రాంతాల్లో (పాక్షిక), బోరబండ రిజర్వాయర్ ప్రాంతాలు (పూర్తిగా), ఖానాపూర్ గ్రావిటీ 1200 ఎంఎం మెయిన్ ఆన్‌లైన్ సప్లయి ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఈ ప్రాంత ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు కోరారు.

సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా బాధ్యతలు తీసుకుంటున్న జోయెల్ డేవీస్

యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

రామకృష్ణమఠం అధ్యక్షుడు బోధమయానంద

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : స్వామి వివేకానంద సందర్శించిన సికింద్రాబాద్‌లోని మెహబూబ్ కాలేజీ ముమ్మాటికీ పుణ్యక్షేత్రమేనని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. స్వామి వివేకానంద తన జీవితంలోనే తొలిసారి మెహబూబ్ కాలేజీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆంగ్ల ప్రసంగం చేసి నాటి సభికులను మంత్ర ముగ్ధులను చేశారని వివరించారు. ఈ చారిత్రక ఘట్టానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ఫిబ్రవరి 13వ తేదీని వివేకానంద డేగా గుర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్ సాగర్‌ను బోధమయానంద శాలువాతో సత్కరించారు.

నేడు ఎల్బీ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : టీఎస్ఎల్‌పీఆర్‌బీ ద్వారా ఎంపికైన వారికి బుధవారం ఎల్బీస్టేడియంలో నియామక పత్రాలు అందజేయనున్నారు. ఇందులో భాగంగా ఎల్బీ స్టేడియం పరిసరాల్లో బుధవారం ఉదయం 10:30 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల హక్కులను కాపాడాలి

గాంధీ దవాఖానను సందర్శించిన జాతీయ సఫాయి కర్మాచారి కమిషన్

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 13 : పారిశుద్ధ్య కార్మికుల హక్కులను కాపాడాలని, కనీస వేతనాల నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖలోని జాతీయ సఫాయి కరమ్‌చారి కమిషన్ (న్యూఢిల్లీ) చైర్మన్ ఎం.వెంకటేశ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల, గాంధీ దవాఖానలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోజు ఎన్ని గంటలు పనిచేస్తున్నారు, వేతనాలు ఎంత ఇస్తున్నారు, ప్రతి నెల సమయానికి జీతాలు చెల్లిస్తున్నారా, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి సదుపాయాలు ఉన్నాయా.? గ్రూప్ బీమా సదుపాయం కల్పించారా..? ఏడాదికి రెండు జతల యూనిఫారం, బూట్లు, మహిళా కార్మికులకు చీరలు ఇస్తున్నారా..? నెలకు నాలుగు సెలవులు ఇస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. పనిచేసే చోట మహిళా కార్మికులు, ఉద్యోగులకు ఏదైనా సమస్యలు, వేదింపులు ఉంటే వాటి గురించి ఫిర్యాదు చేయడానికి ఒక మహిళా ఉన్నతాధికారిని నియమించి, ఆమె ఫోన్ నంబర్ నోటీసు బోర్డులో పెట్టాలని అధికారులకు సూచించారు. గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు, ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ, పరిపాలనా విభాగం అధికారులు, కాంట్రాక్టర్లు, సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షుడు రాజేశ్, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వర్సిటీ ఆచార్యులు

వెయ్యేండ్ల తెలుగు పద్య సాహిత్య వైభవం

కొండాపూర్, ఫిబ్రవరి 13 : ప్రపంచంలోని అనేక భాషలను తనలో కలుపుకోగలిగి, సహజత్వాన్ని కోల్పోని మహత్తర శక్తి తెలుగు భాష సొంతమని మహా సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. గచ్చ